సాక్షి తిరుపతి

ఆదివారం । 17 । సెప్టెంబర్ । 2023



దండాలయ్యా.. మట్టి గణపయ్యా!

సాక్షి మీడియా గ్రూప్, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి ప్రతిమ తయారీపై శిక్షణ ఇచ్చారు. - 8లో



నాలుగో విడత 'నేస్తం'

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్ కాపు నేస్తం పథకం కింద ప్రభుత్వం చేయూతనందిస్తోంది. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	34	24
చిత్తూరు	33	24
తిరుమల	30	20
గూడూరు	38	27
నగరి	34	24

న్యూస్‌రీల్

సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై శనివారం నగరపాలక సంస్థ కమిషనర్ డి.హరిత సమీక్షించారు. అనంతరం శ్రీనివాస సేతు ప్రారంభోత్సవ వేదిక, శిలాఫలక ఆవిష్కరించనున్న ప్రాంతాలను సందర్శించారు. కమిషనర్ మాట్లాడుతూ తిరుపతి స్మార్ట్ సిటీ, టీటీడీ భాగస్వామ్యంతో రూ.650 కోట్లు వెచ్చించి శ్రీనివాస సేతు ఫ్లైఓవర్‌ను పూర్తిచేశామని తెలిపారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా సోమవారం శ్రీనివాస సేతు ప్రారంభించనున్నట్లు వివరించారు. ఈ మేరకు తిరుచానూరు మార్కెట్ యార్డ్ సమీపంలో ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేశామన్నారు. ఎస్ఈ మోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, ఆర్‌ఓలు కేఎల్ వర్మ, సేతుమాధవ్, స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి పాల్గొన్నారు.

రేపటి 'స్పందన' రద్దు

తిరుపతి అర్బన్ : వినాయక చవితి సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు.



అమ్మవారి సేవలో టీటీడీ బోర్డు చైర్మన్ భూమన

సంప్రదాయం పాటిస్తూ..
శ్రీవారి సేవకు..!

సాక్షి, తిరుపతి : పూర్వం రాజుల కాలంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలకు పట్టువస్త్రాలు తీసుకువెళ్లే ముందు తిరుపతిలో తాతయ్యగుంట గంగమ్మను దర్శించుకోవడం ఆనవాయితీగా ఉండేది. ముఖ్యంగా పల్లవులు ఈ సంప్రదాయానికి తెరతీసినట్లు చరిత్రలో పేర్కొన్నారు. కాలక్రమంలో ఈ ఆచారం మరుగునపడింది. తదనంతరం రాజులు ప్రాభవం కోల్పోయారు. ప్రజాస్వామ్య వ్యవస్థ పురుడు పోసుకున్న తర్వాత తిరుమలేశునికి బ్రహ్మోత్సవాల సమయంలో ముఖ్యమంత్రి పట్టువస్త్రాలను సమర్పించడం ప్రారంభమైంది. అయితే పాత సంప్రదాయాలను ఎవరూ పాటించలేదు. ఈ క్రమంలో టీటీడీ బోర్డు చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పూర్వపు ఆచారాలను పునఃప్రారంభించాలని సంకల్పించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తిరుమలకు వెళ్ల ముందు తాతయ్యగుంట గంగమ్మ దర్శనానికి తీసువచ్చారు.

గంగమ్మ తల్లి వైభవం

శతాబ్దాల చరిత్ర గల తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ ఆలయానికి నేడు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. ఎమ్మెల్యే భూమన ప్రత్యేక చొరవతో గంగమ్మ గుడి పునర్నిర్మాణానికి టీటీడీ నుంచి సుమారు రూ.4 కోట్లు మంజూరు చేయించారు. అభివృద్ధి పనులను పరుగులు తీయిస్తున్నారు. ఆలయానికి మహా సంప్రోక్షణ కార్యక్రమాన్ని ఓ పెద్ద పండుగలా నిర్వహించారు. దేశంలోని ప్రముఖ హిందూ ధర్మ ప్రచారకులు, కంచి పీఠాధిపతి శ్రీ విజయేంద్ర సరస్వతి, విశాఖ శారదా పీఠాధిపతి శ్రీ స్వరూపానంద సరస్వతి లాంటి ఆధ్యాత్మిక ప్రముఖులను ఆలయానికి రప్పించారు. గంగమ్మ తల్లి ఆలయ ప్రాశస్త్యాన్ని దశదిశలా వ్యాపింపజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో గంగమ్మ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటింపజేశారు. నభూతో నభవిష్యత్ అనే రీతిలో గంగ జాతరను అంగరంగ వైభవంగా జరిపించారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారు తన చెల్లి గంగమ్మకు సారె పంపే సంప్రదాయాన్ని నగరంలోని ప్రతి ఇంటికీ అలవాటు చేశారు. దీంతో వేలాది మంది అమ్మవారికి సారె సమర్పించే కొత్త విధానానికి శ్రీకారం చుట్టారు.

పల్లవుల కాలం నుంచి మొదలైన సంప్రదాయానికి పెద్దపీట వేశారు. మరుగునపడిన ఆచారానికి మళ్లీ శ్రీకారం చుట్టారు. దేవదేవుని సన్నిధికి వెళ్లే ముందు శ్రీవారి చెల్లెలుతాతయ్యగుంట గంగమ్మను దర్శించుకునే పురాతన పద్ధతిని పునఃప్రారంభించారు. హైందవ ధర్మంపై అపార భక్తివిశ్వాసాలతో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని పూర్వపు విధానాలకు ప్రాణం పోశారు. శ్రీవేంకటేశ్వరస్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు ముఖ్యమంత్రి ముందుగా గంగమ్మతల్లిని సేవించుకుని.. అనంతరం తిరుమలకు బయలుదేరేలా మార్గనిర్దేశం చేశారు. ఈ మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఏడాది పాత ఆచారం పాటిస్తూ బ్రహ్మోత్సవాలకు తరలివెళ్లారు. ఈ ఏడాది సైతం అదే పద్ధతిలో అమ్మవారినే తొలుత దర్శించుకోనున్నారు.

- రేపు తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి సీఎం వైఎస్ జగన్
- తిరుమలకు వెళ్లే ముందు అమ్మవారి దర్శనం
- పురాతన ఆచారానికి పెద్దపీట వేసిన టీటీడీ బోర్డు చైర్మన్ భూమన

గంగమ్మ ఆలయానికి ముఖ్యమంత్రి

తిరుపతిలో తాతయ్య గుంట గంగమ్మ ఆలయానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సోమవారం విచ్చేయనున్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా పట్టువస్త్రాల సమర్పణకు ముందుగా గంగమ్మను దర్శించుకుని తిరుమలకు బయలుదేరనున్నారు. ఇందులో టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కృషిని మరువలేం.



శ్రీవారి బ్రహ్మోత్సవాలకు తిరుమల శోభాయమానంగా ముస్తాబైంది.. దేదీప్యంగా ఆనంద నిలయం వెలుగులు విరజిమ్ముతోంది.. దేవదేవుని సన్నిధి విద్యుద్దీపాలంకరణలో కాంతులీనుతోంది.. మలయప్ప మహోత్సవ సంబరాన్ని వీక్షించి తరించేందుకు భక్తకోటి తరలివస్తోంది..విశిష్ట వాహనసేవలతో వైకుంఠనాథుని వైభవాన్ని ఎలుగెత్తి చాటేందుకు టీటీడీ సర్వం సిద్ధం చేసింది. – తిరుమల

చంద్రగిరికి చవితి శోభ

- ఆధ్యాత్మికం.. అనిర్వచనీయం
- ఉచితంగా 1,060 భారీ గణపతి విగ్రహాల పంపిణీ
- 7 నెలల పాటు విగ్రహాల తయారీ
- ప్రతి సచివాలయానికి 10 విగ్రహాలు
- భారీ సంఖ్యలో తరలివచ్చిన యువత
- ఎమ్మెల్యే చెవిరెడ్డి భక్తితత్పరతకు అభినందనలు

ఆదర్శనీయంగా సేవలు

ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి భక్తితత్వంతో ఆదర్శనీయంగా సేవలందిస్తున్నారని తిరుపతి వినాయక నిమజ్జన కమిటీ కొనియాడింది. 1,060 భారీ వినాయక విగ్రహాల పంపిణీ, లక్ష మట్టి విగ్రహాల తయారీని పరిశీలించి అభినందనలు తెలిపింది. ప్రణాళికతో సాంప్రదాయబద్ధంగా వినాయక విగ్రహాలు తయారీ, పంపిణీ చేపట్టడంపై ప్రశంసలు కురిపించింది. కార్యక్రమంలో తిరుచానూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీవిద్యా గణపతినాయుడు, తిరుపతి వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు భానుప్రకాష్ రెడ్డి, సామంచి శ్రీనివాస్, నవీన్ కుమార్ రెడ్డి, మంగాటి గోపాల్ రెడ్డి, తిరుపతి రూరల్ వైస్ ఎంపీపీ వేముల యశోద, విడుదల మాధవరెడ్డి పాల్గొన్నారు.

తిరుపతి రూరల్ : వేలాదిమంది యువకుల ఆనందోత్సాహాలు.. వందలాది వాహనాల్లో తరలివెళుతున్న గణపతి విగ్రహాలు.. జై జై గణేశా నినాదాలతో చంద్రగిరి మార్మోగింది. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో మట్టి వినాయకుని ప్రతిమల పంపిణీ శనివారం తిరుచానూరు మార్కెట్ యార్డులో అట్టహాసంగా ప్రారంభమైంది. పర్యావరణ హితమే లక్ష్యంగా కాగితంతో తీర్చిదిద్దిన 1,060 గణపతి భారీ విగ్రహాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి కి మోహిత్‌రెడ్డి సాదరంగా స్వాగతం పలికారు. గణపతి ప్రతిమలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈఓ జెండా ఊపి విగ్రహాల తరలింపునకు శ్రీకారం చుట్టారు. చంద్రగిరి నియోజకవర్గంలోని మొత్తం 1,006 పల్లెలకు 1,060 భారీ గణనాథుని విగ్రహాలను పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని ప్రతి సచివాలయానికి 10 విగ్రహాల చొప్పున అందజేశారు.

25 వేల మంది భాగస్వామ్యం

కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా ఆధ్యాత్మిక వాతావరణంలో సంప్రదాయబద్ధంగా వినాయకచవితి జరుపుకోవాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే చెవిరెడ్డి ఏటా గణపతి విగ్రహాలను ఉచితంగా అందజేస్తున్నారు. ప్రతి పల్లెలో 25 మంది యువకులకు బాధ్యతలను అప్పగిస్తున్నారు. అందులో భాగంగా ఈ ఏడాది దాదాపు 25 వేల మంది యువత ఈ కార్యక్రమంలో భాగస్వాములుగా మారారు. ఇందుకోసం 430 మంది కళాకారులు ఏడు నెలల పాటు ఓ మహాయజ్ఞంలా విగ్రహాల తయారీ చేపట్టారు.

యువతను సన్మార్గంలో నడిపించేందుకే..

యువతలో భక్తిభావం పెంచి వారిని సన్మార్గంలో నడిపించేందుకే ఇలాంటి ధార్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే చెవిరెడ్డి తెలిపారు. యువతలో ఆధ్మాతిక భావాలు పెంపొందితే పాపభీతి పెరుగుతుందన్నారు. దీంతో తల్లిదండ్రులు, పెద్దలను గౌరవిస్తారని వెల్లడించారు.



వినాయక విగ్రహాలకు పూజలు చేస్తున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి. తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి తదితరులు



మట్టి విగ్రహాల తయారీని పరిశీలిస్తున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి



పంపిణీకి సిద్ధంగా గణేశుని భారీ విగ్రహాలు



తిరుపతి వినాయక నిమజ్జన కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే చెవిరెడ్డి

బాధ్యతగా ఇంటి స్థలాలు ఇప్పిస్తాం



మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : టీటీడీ ఉద్యోగులతోపాటు రిటైర్డ్ అయినవారికి సైతం బాధ్యతగా ఇంటి స్థలాలు ఇప్పిస్తామని టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి భరోసా ఇచ్చారు. శనివారం పద్మావతిపురంలోని తన నివాసంలో టీటీడీ సిబ్బంది, విశ్రాంత ఉద్యోగుల సంఘం నేతలతో సమావేశం నిర్వహించారు. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తానే ఇంటి స్థలాలు ఇప్పించిన విషయం గుర్తుచేశారు. మళ్లీ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు టీటీడీ ఉద్యోగులను పట్టించుకోలేదని తెలిపారు. శ్రీవారు మళ్లీ అవకాశమిచ్చారని, ఈ పర్యాయం టీటీడీ ఉద్యోగులతోపాటు విశ్రాంత సిబ్బందికి సైతం నివాస స్థలాలు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. అనవసర వివాదాలకు పోకుండా సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు. దీనిపై ఉద్యోగు సంఘాల నేతలు మాట్లాడుతూ భూమన నేతృత్వంలో తమకు తప్పకుండా న్యాయం జరుగుతుందనే నమ్మకం ఉందని తెలిపారు.

దండాలయ్యా.. మట్టి గణపయ్యా..!

- చిన్నారుల చేతుల్లో మట్టి గణేశుని విగ్రహ తయారీపై శిక్షణకు విశేష స్పందన
- సాక్షి మీడియా గ్రూప్, కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహణ
- ప్రతిభ చాటిన విజేతలకు బహుమతుల ప్రదానం


ప్రతిమల తయారీపై శిక్షణ ఇస్తున్న టీచర్లు


మాట్లాడుతున్న ఏపీ కాలుష్య నియంత్రణ మండలి అడ్మిన్ హెడ్ కుమార్‌రెడ్డి

తిరుపతి కల్చరల్ : సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం తిరుపతి జీవకోనలోని విశ్వం స్కూల్ వేదికగా 'చిన్నారుల చేతుల్లో మట్టి గణపతి విగ్రహాల తయారీ'పై శిక్షణ శిబిరం నిర్వహించారు. భావితరాలకు కాలుష్య రహిత పర్యావరణం అందించడానికి మేము సైతం అంటూ ఈ కార్యక్రమానికి విద్యార్థి లోకం కదలివచ్చింది. మట్టి గణపయ్యా నీకు వందనాలయ్య అంటూ వినాయక ప్రతిమల తయారీకి సన్నద్ధమైంది. చిట్టి చేతుల్లో మట్టి వినాయక ప్రతిమలు జీవం పోసుకున్నాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ కాలుష్య నియంత్రణ మండలి అడ్మిన్ హెడ్ కుమార్


బహుమతులందుకున్న విజేతలతో నిర్వాహకులు

రెడ్డి, అనలిస్ట్ శిల్ప , సాక్షి బ్రాంచి మేనేజర్ సత్యేంద్రబాబు, విశ్వం విద్యాసంస్థల అధినేత ఎస్.తులసీ విశ్వనాథ్, డైరెక్టర్ విశ్వచందన్ హాజరయ్యారు. మట్టి వినాయక ప్రతిమలను తయారు చేసే విధానంపై క్రాఫ్ట్ టీచర్ తేజస్విని శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు మట్టి గణపయ్య ప్రతిమలను అద్భుత రీతిలో రూపొందించారు. విద్యార్థుల చేతుల్లో తయారైన మట్టి గణపతి ప్రతిమలను పరిశీలించి విజేతలను ప్రకటించారు. ఈ సందర్భంగా కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కాలుష్య రహిత పర్యావరణం.. మానవాళి మనుగడకు మార్గదర్శకమని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. తులసీవిశ్వనాథ్ మాట్లాడుతూ వినాయకచవితి పిల్లల పండుగని, ఈ పర్వదినాన్ని అందరూ సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని కోరారు. పిల్లలకు మట్టి వినాయక ప్రతిమ తయారీపై అవగాహన కల్పించడం సంతోషంగా ఉందని తెలిపారు. సాక్షి బ్రాంచ్ మేనేజర్ సత్యేంద్రబాబు మాట్లాడుతూ గణనాయకుడిని పర్యావరణ హితంగా తయారు చేసుకుని, పూజించిన వారికి స్వామి ఆశీస్సు


మట్టి వినాయక ప్రతిమలు తయారు చేస్తున్న చిన్నారులు

లు అందుతాయని వెల్లడించారు. విశ్వచందన్ మాట్లాడుతూ వినాయకుని పూజా విశిష్టతను వివరించారు.

బహుమతుల ప్రదానం

చిన్నారుల చేతుల్లో మట్టి గణపయ్య శిక్షణ శిబిరం సందర్భంగా విజేతలను ఎంపిక చేసి బహుమతులు ప్రదానం చేశారు. 9వ తరగతి విద్యార్థి కె.సంతోష్,(విశ్వంస్కూల్), 10వ తరగతి జి.గీతాంజలి, 3వ తరగతి ఎ.దాన్విక ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నారు. అలాగే 9వ తరగతి విద్యార్థిని ఎస్.రమ్య, 8వ తరగతి ఇ.విక్రమ్, 6వ తరగతి ఎం.సుజాత, ఎ.మాళవిక, 10వ తరగతి యు.మోక్షజ్ఞాన్, ఇ. ప్రతిన్ నాయక్, బి.మహేష్ కన్సులేషన్ బహుమతులు కైవసం చేసుకున్నారు. సాక్షి ఈవెంట్ ఇన్‌చార్జి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నాలుగో విడత 'నేస్తం'

- మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూత
- వైఎస్సార్ కాపు నేస్తం కింద సాయం
- జిల్లాలో 8,512 మంది ఖాతాల్లో రూ.12.76 కోట్ల జమ


లబ్ధిదారులకు మెగా చెక్కు అందిస్తున్న మేయర్ శిరీష తదితరులు

తిరుపతి అర్బన్ : మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన పథకాలు అమలు చేస్తున్నారని తిరుపతి నగర మేయర్ శిరీష తెలిపారు. అందులో భాగంగా కాపు ఆడపడుచుల అభ్యున్నతికి వైఎస్సార్ కాపు నేస్తం కింద చేయూతనందిస్తున్నట్లు వెల్లడించారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగో విడత వైఎస్సార్ కాపు నేస్తం నిధులను విడుదల చేశారు. తిరుపతి కలెక్టరేట్ నుంచి మేయర్‌తోపాటు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కోదండరామిరెడ్డి, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి భాస్కర్‌రెడ్డి, బీసీ కార్పొరేషన్ ఏఈఓ బాబురెడ్డి పాల్గొన్నారు. మేయర్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందన్నారు. అందులో భాగంగా వైఎస్సార్ చేయూత, ఆసరాతోపాటు 45–60 ఏళ్ల బలిజ, తెలగ, ఒంటరి కులాలకు చెందిన మహిళలకు ఏటా రూ.15వేల ఆర్థికసాయం చేస్తోందని వెల్లడించారు. ఈ క్రమంలో జిల్లాలోని 8,512 మంది లబ్ధిదారుల ఖాతాల్లో మొత్తం రూ.12.76 కోట్లు జమ చేశారని వివరించారు. 2020–21 నుంచి నాలుగు విడతలలో కాపు నేస్తం పథకం కింద మొత్తం 30,176 మందికి రూ. 45.26 కోట్ల లబ్ధి చేకూరినట్లు తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్కు పంపిణీ చేశారు.

యాదవుల అభ్యున్నతే లక్ష్యంగా ముందు సాగుదాం


మాట్లాడుతున్న మహేష్ యాదవ్

తిరుపతి కల్చరల్: యాదవుల అభ్యున్నతే లక్ష్యంగా తమ హక్కుల కోసం ఐక్యంగా ముందుకు సాగాలని అఖిల భారతీయ యాదవ మహాసభ జాతీయ అధ్యక్షుడు మహేష్ యాదవ్ పిలుపు నిచ్చారు. అఖిల భారతీయ యాదవ మహాసభ జాతీయ కార్యవర్గ సమావేశాలు శనివారం ఓ ప్రైవేటు హోటల్లో ప్రారంభమయ్యాయి. ఈ సభలకు ఆయనే ముఖ్య అతిథిగా విచ్చేసి, ప్రసంగించారు. దేశంలో సుమారు 30 కోట్ల మంది యాదవులు ఉన్నారన్నారు. స్వాతంత్రం వచ్చి 70 ఏళ్లకు పైగా అవుతున్నా ఇప్పటి వరకు యాదవులకు సామాజిక, విద్యా, రాజకీయ పరంగా ఎటువంటి న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రాజకీయ పార్టీదలు యాదవ కులస్తులను ఓటు బ్యాంక్‌గా వాడుకున్నాయని, రాజ్యాంగపరంగా హక్కులు కల్పించడలో ప్రభుత్వాలు విఫలం చెందాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారతీయ యాదవ మహాసభ జాతీయ ఉపాధ్యక్షుడు అన్నా రామచంద్రయ్య, రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు, నాయకులు పాల్గొన్నారు.